# 'చలో వరంగల్' పోస్టర్ల ఆవిష్కరణ



భిక్కనూరులో చలో వరంగల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భిక్కనూరు, ఏప్రిల్ 18 : మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చలో వరంగల్ పోస్టర్లను నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి అత్తెలి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ నెల 27న ఎల్కతుర్తి (వరంగల్)లో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు ప్రజలు స్వచ్ఛందగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భిక్కనూరు మాజీ సర్పంచ్ తునికి వేణు, ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు యాదగిరి, రాంచంద్రం, సాయిరెడ్డి, నర్సారెడ్డి, భూంరెడ్డి, రవీందర్‌రెడ్డి, పోతిరెడ్డి, సాయాగౌడ్, మల్లేశం, బాల్‌చంద్రం, వాసు యాదవ్, రాజిరెడ్డి, శివలింగం, అనంత్ గౌడ్, వెంకట్‌గౌడ్, రవి, దేవర లక్ష్మి, అన్ని గ్రామాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనులు



మోతెలో ఉపాధి పనులకు హాజరైన కూలీలు

లింగంపేట, ఏప్రిల్ 18 : లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి పనులు కొనసాగుతున్నాయి. వలసల నివారణ కోసం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో కూలీలతో పనులు చేపడుతున్నారు. బోరుబావులు వద్ద ఫాంపాండ్స్, భూగర్భ జలాల పరిరక్షణ కోసం ఇంకుడు గుంతలు, ఫిష్ ఫాండ్స్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఫార్మేషన్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నిత్యం వంద మందికి పైగా కూలీలు పనులకు హాజరువుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న చెరువుల్లో ఫిష్ పాండ్స్ నిర్మాణాలు చేపడుతున్నారు. చేపల పెంపకంతో ఆర్థిక అభివృద్ధి సాధించడంతోపాటు ఉపాధి అవకాశాలు కలుగుతాయని అధికారులు వెల్లడిస్తున్నారు. బోరు బావుల వద్ద ఫాంపాండ్స్ నిర్మాణాలపై అధికారులు రైతులకు అవగాహన కల్పించి గుంతల తవ్వకాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు.

## కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలి

మాచారెడ్డి, ఏప్రిల్ 18 : ఈ నెల 20వ తేదీన గజ్యా నాయక్‌తండా, ఎక్స్‌రోడ్ గ్రామంలోని శివబాలాజీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పగడాల బాల్‌చంద్రం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి ఆయా గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

## వేసవిలో ఉద్యోగోన్నతులు, బదిలీలు

కామారెడ్డి, ఏప్రిల్ 18 : వేసవిలో ఉద్యోగోన్నతులు, బదిలీలు ఉంటాయని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని డెయిరీ టెక్నాలజీ ఆడిటోరియంలో పీఆర్టీయూ కామారెడ్డి జిల్లా శాఖ నిర్వహించిన కార్యనిర్వాహక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పీఆర్టీయూ అనేక సమస్యలు పరిష్కరించిందని అన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కుషాల్, జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

**కాలభైరవస్వామిని దర్శించుకున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ**

రామారెడ్డి, ఏప్రిల్ 18 : రామారెడ్డి-ఇసన్నపల్లీ గ్రామా ల్లో వెలసిన కాలభైరవస్వామిని శుక్రవారం ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆయన వెంట పీఆర్టీ యూ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు కుశాల్, మండల అధ్యక్షుడు రాజు, అనిల్‌కుమార్ ప్రేమ్‌సాగర్ తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

పెద్ద కొడప్‌గల్ (పిట్లం), ఏప్రిల్ 18 : రోడ్డు ప్రమాదంలో ఓ కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన సిద్దాపూర్ శివారులో చోటు చేసుకున్నది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం మండలంలోని పోలీస్ స్టేషన్‌లో బుచ్చయ్యచారి కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం తన విధులు ముగించుకొని పిట్లం నుంచి బాన్సువాడకు బైక్‌పై బయల్దేరాడు. రాత్రి 11 గంటల సమయంలో పిట్లం మండలం సిద్ధాపూర్ గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద రోడ్డు పక్కన ఉన్న ఈత చెట్టుకు ఢీకొన్నాడు. తల, ఛాతికి బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం



వెలుగనూర్‌లో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు నర్సింహారెడ్డి

నిజాంసాగర్, ఏప్రిల్ 18 : నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో ఉన్న వెలుగనూర్ గ్రామంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సహకార సంఘం అధ్యక్షుడు నర్సింహారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన జొన్నలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. జొన్నల్లో తేమ శాతం 14కు మించకుండా ఉండాలని తెలిపారు. మద్దతు ధర క్వింటాలుకు రూ.3,371 అని తెలియజేశారు. కార్యక్రమంలో మానిటరింగ్ అధికారి కరుణాకర్‌రెడ్డి, నాయకులు రమేశ్‌గౌడ్, ఆనంద్ కుమార్, వెంకటేశ్వర్లు, సహకార సంఘం సెక్రటరీ సంగమేశ్వర్ గౌడ్, డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

ఎల్లారెడ్డి రూరల్(నాగిరెడ్డిపేట్), ఏప్రిల్ 18 : ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను శుక్రవారం పట్టుకున్నట్లు నాగిరెడ్డిపేట్ ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని గోలిలింగాల గ్రామ పరిధిలోని మంజీరా నదిలో నుంచి గురువారం ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు దాడి చేసి ఆరు ట్రాక్టర్లను పట్టుకున్నామన్నారు. కోడె గంగారాం, తొంట సిద్ధిరాములు, పెట్ల సత్యనారాయణ, పుట్ల సంతోష్, కాంచనపల్లి లింగాగౌడ్, పుట్ల కిష్టయ్యకు చెందిన ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని వారిని అదుపులోకి తీసుకొన్నామన్నారు. ట్రాక్టర్లను సీజ్‌చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## రేపు సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష

కామారెడ్డి, ఏప్రిల్ 18 : ఈ నెల 20వ తేదీన మహాత్మా జ్యోతిబాపూలే (బీసీ గురుకులం) పాఠశాలలో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి (6 నుంచి 9వ తరగతి వరకు) ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈవో రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నాలుగు కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రానికి గంట ముందు చేరుకోవాలని, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు.

## రాజీవ్ యువ వికాసం గడువు పొడిగించాలి

ముప్కాల్, ఏప్రిల్ 18: రాజీవ్ యువ వికాసం గడువును పొడిగించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ముప్కాల్ మాజీ ఉప సర్పంచ్ కట్ట మహేశ్ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజీవ్ యువ వికాసం గడువును రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 14వ తేదీలోపు పూర్తిచేసిందని తెలిపారు. చాలా మంది ఆదాయ, కుల, ఇతర సర్టిఫికెట్ల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి, గడువులోపు దరఖాస్తు చేసుకోలేదని పేర్కొన్నారు. దీంతోపాటు సర్వర్ సమస్య కూడా ఎదురైందని తెలిపారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని గడువు తేదీని పొడగించాలని కోరారు.

# మెడికల్ కళాశాలలో అక్రమ నియామకాలు రద్దు చేయాలి



మాట్లాడుతున్న విద్యార్థి సంఘ నాయకులు

కామారెడ్డి, ఏప్రిల్ 18 : కామారెడ్డి మెడికల్ కళాశాలలో చేపట్టిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల అక్రమ నియామకాలపై నిగ్గు తేల్చాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారికి గురువారం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని అన్నారు. మెరిట్ ఆధారంగా తీసుకోకుండా కామారెడ్డి మ్యాన్ పవర్ ఏజెన్సీ డబ్బులు తీసుకొని ఉద్యోగాలను భర్తీ చేశారని ఆరోపించారు. దీనిపై డీఎంఈ, కలెక్టర్‌తో విచారణ కమిటీ ఏర్పాటు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు విఠల్, ముదాం అరుణ్, నీల నాగరాజు, అజయ్, శివ, రాహుల్, మనోజ్, మణికంఠ పాల్గొన్నారు.

# చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

లింగంపేట(తాడ్వాయి)/ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 18 : తాడ్వాయి మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని కరడ్‌పల్లి, ఎండ్రియాల్, ఎర్రపహాడ్, తాడ్వాయి గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సీఎస్ఐ చర్చి పాస్టర్ రేవా, రవీందర్ ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల క్రైస్తవులు, మహిళలు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని సెయింట్ ఆండ్రీవ్స్ చర్చిలో గుడ్‌ఫ్రైడే కార్యక్రమాలు నిర్వహించారు. ఫాదర్ రెవరెండ్ ప్రభాకర్, ప్రాపర్టీ సెక్రటరీ సాల్మన్‌రాజ్, సెక్రటరీ రాజశేఖర్, స్టువర్ట్ జాన్‌బ్రహ్మయ్య, ట్రెజరర్ ప్రభుకుమార్, మెర్సీమాలిని, వాసంతి, బిషప్ కమిటీ సభ్యులు, ఎల్లారెడ్డి చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన క్రైస్తవులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డి సెయింట్ ఆండ్రీవ్స్ చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



లింగంపేటలో ..

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న విద్యుత్ శాఖ డీఈ విజయసారథి

లింగంపేట, ఏప్రిల్ 18 : మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఉన్న విశ్వకర్మ కాలనీలో 63 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ శాఖ డీఈ విజయసారథి శుక్రవారం ప్రారంభించారు. విశ్వకర్మ కాలనీలో లోవోల్టేజీ సమస్య అధికంగా ఉందని కాలనీ వాసులు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అధికారులు స్పందించి నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్ బిగించి లోవోల్టేజీ సమస్య పరిష్కరించారు. విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో ఏడీఈ మల్లేశ్, ఏఈ సాయినాథ్, లైన్‌మెన్లు వహీద్, ఆదిరెడ్డి, నాయకులు బుర్ర నారాగౌడ్, సంగన్నగారి రవీందర్‌గౌడ్, దేశ్‌ముఖ్ రాజు, సాజిద్, సుప్పాల రాజు, నగేశ్‌తోపాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ సంఘం కార్యవర్గం ఎన్నిక

లింగంపేట, ఏప్రిల్ 18 : లింగంపేట మండలంలోని పర్మళ్ల గ్రామ అంబేద్కర్ సంఘం కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంబేద్కర్ సంఘం అధ్యక్షుడిగా గంట లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా రాజుగారి సాయిలు, ప్రధాన కార్యదర్శిగా లెగ్గల రాజు, సహాయ కార్యదర్శిగా గోపాల్, కోశాధికారిగా మన్నె గంగారాం, కార్యవర్గ సభ్యులుగా గంట బాబు, పర్వయ్య, పద్మారావు, బాలపోశయ్య, ఇస్తారి, బాలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ఈతవనం దగ్ధం



ఈతవనాన్ని పరిశీలిస్తున్న ఆబ్కారీ సీఐ, అధికారులు

రామారెడ్డి(గాంధారి), ఏప్రిల్ 18 : మండల కేంద్రంలో ఈదుల్లవాగు శివారులో ఉన్న ఈత వనం దగ్ధమైంది. గౌడ కులస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఈత వనానికి నిప్పు పెట్టడంతో దగ్ధమైందన్నారు. ఎల్లారెడ్డి ఆబ్కారీ సీఐ షాకీర్ హైమద్ ఆధ్వర్యంలో ఘటనాస్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ చెట్లకు కావాలని నిప్పు పెట్టారా లేదా ప్రమాదవశాత్తు కాలిపోయాయా అని ఆబ్కారీ అధికారులు పరిశీలించారు. ఆబ్కారీ ఎస్సై జగన్‌మోహన్, హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య, గౌడ కులస్తులు శ్రీకాంత్‌గౌడ్, వెంగాగౌడ్, సాయికుమార్ తదితరులు ఉన్నారు.

## ఆర్థికసాయం అందజేత

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 18 : బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామానికి చెందిన గాజుల సాయిలు ఇటీవల అనారోగ్యంలో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులకు 2000-2001 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాగరాజు, రాజేందర్, రమేశ్, నగేశ్, రవీందర్, పీరుగొండ తదితరులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్ 18 : మండలంలోని బేగంపూర్ చౌరస్తా వద్ద జాతీయ రహదారి 161పై శుక్రవారం ఎస్సై మహేందర్ వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వాహనాలు నడిపే సమయంలో వాహనాలకు సంబంధించిన పత్రాలు వెంట పెట్టుకోవాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## యోగా అసిస్టెంట్లకు సర్టిఫికెట్లు పంపిణీ

కామారెడ్డి, ఏప్రిల్ 18 : భారత స్వాభిమాన్ కామారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అసిస్టెంట్ యోగా టీచర్ కోర్సు పూర్తి చేసుకొని ఉత్తీర్ణులైన 19 మంది సభ్యులకు శుక్రవారం యోగా నిర్వాహకులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ రాజారాం మాట్లాడుతూ.. కామారెడ్డిలో ఇంత మంది యోగా శిక్షకులు ముందుకు రావడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి భారత్ స్వాభిమాన్ జిల్లా ప్రబారి రాంరెడ్డి, యోగా గురువులు గరిపల్లి అంజయ్య, బాస రఘుకుమార్, పెట్టిగాడి అంజయ్య, రమేశ్, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ ఆలయంలో చోరీ

భిక్కనూరు, ఏప్రిల్ 18 : మండలంలోని సిద్ధరామేశ్వర్ గ్రామంలో గుర్తు తెలియని దుండగులు శుక్రవారం ఉదయం చోరీకి పాల్పడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దమ్మ ఆలయంలో గుర్తు తెలియని దుండగులు ఆలయ తాళం పగులగొట్టి హుండీలో ఉన్న నగదుతోపాటు అమ్మవారి మెడలో ఉన్న రెండు లక్షల విలువైన బంగారు, వెండి అభరణాలను ఎత్తుకెళ్లారు. భిక్కనూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

**సదాశివనగర్‌లోని ఓ ఇంట్లో..**

రామారెడ్డి(సదాశివనగర్), ఏప్రిల్ 18 : సదాశివనగర్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బంజ సిద్దవ్వ ఇంటికి తాళం వేసి రెండు రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లింది. తిరిగి శుక్రవారం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. రూ.పది వేల నగదు, రూ.పది వేల విలువైన బంగారం, వెండి వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. సదాశివనగర్ సీఐ సంతోష్, ఎస్సై రంజిత్ ఇంటిని పరిశీలించారు. బంజ సిద్దవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## వ్యక్తి అదృశ్యం

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 18 : పెద్ద కొడప్‌గల్ మండలంలోని రతన్‌సింగ్ తండాకు చెందిన వ్యక్తి బానోత్ వెంకట్(40) అదృశ్యమైనట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రతన్‌సింగ్ తండాకు చెందిన వ్యక్తి బానోత్ వెంకట్‌కి మతిస్థిమితం సరిగాలేదు. ఈ నెల 6న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి ఇంటి రాలేదు. శుక్రవారం వెంకట్ భార్య బానోత్ విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# వన్యప్రాణుల దాహార్తి తీర్చడానికి సాసర్‌పిట్స్ ఏర్పాటు



జుక్కల్ మండలం బస్వాపూర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో సాసర్ పిట్స్‌లో నీటిని నింపుతున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాములు

బిచ్కుంద(జుక్కల్), ఏప్రిల్ 18 : ఎండలు దంచికొడుతున్నాయి. అడవీ జంతువులు తాగునీటి కోసం అల్లాడుతున్నాయి. ఈ నేపథ్యంలో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు సాసర్ పిట్స్‌ను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. జుక్కల్ మండలంలోని బస్వాపూర్ గ్రామ రిజర్వ్ ఫారెస్టులో జుక్కల్ రేంజ్ ఫారెస్టు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అడవిలో మూగ జీవాలు నీరు తాగేందుకు అనుకూలంగా ఉన్న పలు ప్రాంతాల్లో సాసర్ పిట్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఫారెస్టు అధికారులు సాసర్ పిట్స్‌ను శుభ్రపరిచి, ట్యాంకర్ సహాయంతో నీటిని నింపారు. ఫారెస్టు బీట్ ఆఫీసర్ రాములు మాట్లాడుతూ.. అడవిలో పలు రకాల మూగజీవాలు సంచరిస్తున్నాయని తెలిపారు. ఆ మూగ జీవాలు దాహం తీర్చుకోవడానికి జనావాసాల్లోకి రాకుండా అడవీలోని సాసర్ పిట్స్‌లో ట్యాంకర్ ద్వారా నీటిని నింపుతున్నామన్నారు. ఈ సాసర్ పిట్స్‌లో ప్రతి 10 నుంచి 15 రోజుల కోసారి నీటిని నింపుతామని తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉన్న సమయాల్లో నీటి వినియోగం అధికంగా ఉండే ప్రాంతాల్లో తరచూ నీటిని నింపుతామన్నారు. వీటి ద్వారా జంతువులకు తాగడానికి నీరు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటుందన్నారు. సాధారణంగా ఈ కార్యక్రమం మార్చి, ఏప్రిల్, మే నెలల్లో చేపడతామని తెలిపారు.

# అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ

బిచ్కుంద(జుక్కల్), ఏప్రిల్ 18 : ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే అగ్ని ప్రమాదాలు నివారించవచ్చని మద్నూర్ అగ్నిమాపక అధికారి రాజయ్య అన్నా రు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా జుక్కల్ మండలంలోని ఇండియన్ గ్యాస్ గోడౌన్ వద్ద శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇండ్లల్లో సంభవించే గ్యాస్ లీకేజీలు, వివిధ రకాల అగ్ని ప్రమాదాలు, నివారణ చర్యలను ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాల విషయంలో అజాగ్రత్తగా ఉండకూడదని అన్నారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మన్ రాజేందర్, డీవోపీ హరీశ్, సిబ్బంది సంతోష్, హరిప్రసాద్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

**హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ వద్ద అవగాహన**

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 18 : గోడౌన్‌లో అగ్ని ప్రమాదాలను అరికట్టడానికి తగినంత నీరు, అగ్నిమాపక సాధనాలను సిద్ధంగా ఉంచాలని అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ వద్ద శుక్రవారం ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణపై పలు విషయాలను వివరించారు.

పైకప్పు, స్టాకుకు మధ్య కనీసం రెండు అడుగుల దూరాన్ని ఉంచాలన్నారు. వస్తువులను ఎత్తడం, దించడం వంటి పనులు చేసే సమయాల్లో ట్రక్కులు, లారీలు, ఇతర వాహనాల ఇంజన్లను ఆఫ్ చేయాలన్నారు. గోడౌన్‌లో తగినంత గాలి, వెలుతురు వచ్చే విధంగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి అగ్నిమాపక సిబ్బంది, హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ సిబ్బంది, ప్రజలు ఉన్నారు.

## అలరించిన కుస్తీ పోటీలు



బహుమతిని అందజేస్తున్న రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం

బాన్సువాడ, ఏప్రిల్ 18 : బాన్సువాడలో భేతాళ స్వామి జాతరను పురస్కరించుకొని శుక్రవారం నిర్వహించిన కుస్తీ పోటీలు అలరించాయి. బాన్సువాడ, నిజామాబాద్, నారాయణ్‌ఖేడ్, అలంపూర్, మహారాష్ట్ర, కర్ణాటక, నాందేడ్, దెగ్లూర్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి మల్లయోధులు తరలివచ్చి పోటీల్లో పాల్గొన్నారు. చివరి కుస్తీ పోటీలో విజేతకు రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి బహుమతిని అందజేశారు. గ్రామ పెద్దలు జలపతి రెడ్డి, కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, కమిషనర్ శ్రీహరి రాజు, కాసుల రోహిత్, నర్సుగొండ, శ్రీనివాస్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, సాయిలు, లింగం తదితరులు పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై వ్యకి ఆత్మహత్య

కామారెడ్డి రూరల్, ఏప్రిల్ 18 : కామారెడ్డి మండలం క్యాసంపల్లి గ్రామానికి చెందిన శివోల్ల చిన్న గంగయ్య(40) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గంగయ్య కొంతకాలంగా తాగుడుకు బానిసయ్యాడు. ప్రతిరోజూ భార్యతో గొడవ పడేవాడు. గురువారం రాత్రి డబ్బుల విషయంలో మళ్లీ గొడవపడ్డాడు. అదేరోజు రాత్రి భార్య, పిల్లలు ఆరుబయట పడుకున్నారు. ఉదయం చూసేసరికి తాడుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భర్త మృతిపై ఎవరిపైనా ఎలాంటి అనుమానం లేదని భార్య తెలిపింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## అర్హులకు ఇండ్లు అందేలా చూడాలి

బీబీపేట, ఏప్రిల్ 18 : అర్హులైన వారు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునేలా చూడాలని ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయా గ్రామాల ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు ఎంపీడీవో మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన వారు నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మార్కెంట్ కమిటీ చైర్మన్ పాత రాజు, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## పాడె మోసిన మాజీ ఎమ్మెల్యే షిండే



బిచ్కుందలోని మాలెగాం సావిత్రీ బాయి పాడే మోస్తున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

బిచ్కుంద, ఏప్రిల్18: మండల కేంద్రానికి చెందిన మాలేగాం సావిత్రీబాయి గురువారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందగా, అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే బాధిత కుటుంబాన్ని పరామర్శించి, సావిత్రీ బాయి మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు. సావిత్రీబాయి ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ హయాంలో మండల అధ్యక్షురాలిగా ఎంతో సేవ చేశారని, అలాంటి కార్యకర్తను కోల్పోవడం బాధగా ఉన్నదని ఈ సందర్భంగా షిండే పేర్కొన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ నాల్చర్ రాజు, డాక్టర్ రాజు,ఖత్‌గావ్ హన్మాండ్లు,డాక్టర్ నర్సింహులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో కూలీ మృతి

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 18 : ఇటుక బట్టీ వద్ద విద్యుత్ షాక్‌తో కూలీ మృతిచెందిన ఘటన జగన్నాథ్‌పల్లి తండా శివారులో శుక్రవారం చోటు చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఎస్సై, స్థానిక కూలీలు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్ జిల్లా కల్లాలి గ్రామానికి చెందిన గజానన్(20) పెద్ద కొడప్‌గల్ మండలంలోని జగన్నాథ్‌పల్లి తండా శివారులో ఇటుక బట్టీల వద్ద కూలీగా పనిచేస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఇటుక బట్టీల దగ్గర విద్యుత్ బల్బు వెలుగలేదు. దానిని సరి చేసే క్రమంలో ప్రమాదవశాత్తు షాక్ తగిలి పడిపోయాడు. అక్కడే పని చేస్తున్న కూలీలు బాన్సువాడ దవాఖానకు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యంలో మృతిచెందాడు. ఇటుక బట్టీ యజమాని నిర్లక్ష్యంతోనే మృతిచెందాడని స్థానిక కూలీలు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**రోడ్డు ప్రమాదంలో మరో వ్యక్తి..**

భిక్కనూరు, ఏప్రిల్ 18 : మండలంలోని జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులో జాతీయ రహదారిపై శుక్రవారం సదాశివనగర్ మండలం కల్వారాల్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ (43) బీబీపేట్‌లో బంధువులు ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నాడు. తిరుగు ప్రయాణంలో స్వగ్రమమైన కల్వారాల్‌కు వెళ్తున్నాడు. జంగంపల్లి గ్రామ శివారులో జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు.